## కర్కాటకం - సింహం

"ఆలిమర్కాటకంగాను ఇల్లు యిర్కాటకంగాను ఉండాలి" అంటారు. సరిగ్గా అలాగ్గానే వున్నాయి. ఆ రెండు సందర్భాలు ఆ ప్రాథమికోపాధ్యాయుని పట్ల చెప్పాలంటే-కాని భార్య నీళ్ళాడి వాళ్లో వోపిల్లాణ్ణి పెట్టుకు నులకమంచం పట్టిమీద కూర్చునే సరికి, ఎక్కడలేని ఆనందం పుట్టుకొచ్చింది ఆ యుపాధ్యాయులకు-తోచని కుశలప్రశ్నగా కుటుంబాన్ని "ఏలా వున్నారు? ఏమిటి?" అని మందహాసంతో అడిగాడు. "కులాసాగానే వున్నాం" అంది యిల్లాలు. "ఇద్దరూ?" "ఏం? ఆలా అడిగారు?" "ఏమీలేదు, లగ్నం కర్కాటకలగ్నం. అంచేత ఎక్కడన్నా దోషముందేమోనని" "బాగా చూచారా?" "ఆఁ" "అందుచేతనే కామోసు నా నడుం కొద్దిగా పీకుతూంది" "ఆలా చెప్పు! ఇంకా?" "రాత్రి చలేసి వణికించేసింది!" "వాతాన్ని కాదు కదా?" "వాతాన్ని అయినట్టు కనబడదు. వాతాన్నే అయితే తెల్లారి ఇలా కూర్చోగలనా? చూచారా పిల్లాడి ముఖం?" అని చూపించింది.

ప్రాథమికోపాధ్యాయుడు చూచీ చూడకుండానే "చూచా! చూచా!" అని అంటూ నిష్క్రమించాడు. తల్లి పిల్లణ్ణి నూద్దెట్టుకుంటూ "ఎంచక్కటి నా తండ్రీ! బజ్జుకో" అని మంచంమధ్య పరుండబెట్టి లేచి నిలబడింది. పిల్లడు అరమోడ్పు కందోయిగా విదరోతూ, తాను కంటూవున్న కలను అంతా తానే అనుభవించకుండా, కొంత కొంత లోకంకోసం నల్లటి తెప్పలగుండా వెలువరిస్తున్నాడు. తల్లి పిల్లణ్ణి ప్రక్కకు త్రిప్పుకు మెత్తటి పొత్తి కప్పి, "ఏమండోయి ఇలారండి వొక్కసారి" అని కేకేసింది భర్తని.

భర్త ఏడీ ? వీధి గుమ్మంలోనూ లేడు. వీధిలోనూలేడు. ఊళ్లోనూలేడు. ఊరిబయట లేడు. ఎదో—డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటుగారి వద్దనుంచి వచ్చిన తాఖీదు చూసుకుంటూ, అప్పటికి అరఘడియ అయి, అప్పుడే సామర్లకోటనుంచి కాకినాడకు వున్న డీసెల్ యెక్కి వెళ్ళిపోయినాడు. అవసరమైతే యెదిరింటి ఇల్లాల్ని సాయపడమని ప్రార్థించి ప్రార్థించి మరీ వెళ్ళిపోయినాడు. తప్పనిసరి వచ్చి వెళ్ళిపోయినాడు. అయినా ఇంతకూ పురిటి పత్యంపెట్టేరోజు మర్నాడు. వాడామె క్కావలసిందల్లా కుసిన్ని మరిగిన మంచినీళ్లు. అవి ఉదయాన్నే సలసలా కాచి గుమ్మంలో వుంచేశాడాయెను తను.

నిశ్చితంగా డీసెల్ ఎక్కాడు. కాకినాడలోనూ నిశ్చితంగానే దిగాడు. అక్కడ హోటల్లో భోజనం నిశ్చితంగానే చేశాడు. బోర్డు ఆఫీసులో పనీగినీ నిశ్చితంగానే తెముల్చుకున్నాడు. తిరిగి అపరాహ్ణం ఏలూరు వెళ్ళేకోచ్ ఆ ప్రాథమికోపాధ్యాయుడు నిశ్చితంగానే అందుకుని ఎక్కగలిగాడు.

ఎక్కి వొకదిక్కున కూర్చోవడంలో ప్రారంభించింది వాని చింత—అసలు ఆ చింత ఆ యుపాధ్యాయునిది కానేకాదు. తోడివాడినుండి అతగానికి కలిగిన చింత—ప్రక్కనే వొక మరో పూరి ప్రాథమికోపాధ్యాయుడు ఇతగాడికి దసులయ్యాడు ఆ బండిలో. మనవాని పేరు మార్కండేయ శర్మ. అతగాని పేరు హనుమచ్ఛిద్ధాంతి, హనుమచ్ఛిద్ధాంతి మార్కండేయశర్మను తొలిసారి పలకరించడంలోనే ఇలా అన్నాడు. "లోకంలో చింతలేనివాడుండ దనుకుంటాను. నాయనా! నీకీమధ్యను యువరాజ కలిగాడన్నారు. తల్లీ పిల్లా కులాసాగా నున్నారా ?" అని.

మొదటిముక్క ఎవరికోసమో అన్నట్టు మార్కండేయశర్మ చిరునవ్వు నవ్వుతూ ఇలా జవాబిచ్చాడు. "కులాసాగానే వున్నారు. అయినా—అయినా—" అని కూడా కూడా నసిగాడు. "అదే నేనన్న చింత! పూర్తిగా వివరించు—పిల్లవాని జాతక చక్రంవేసి చూశావా? చూశావా? అదే నేనన్నచింత!" "పిల్లవానికేం — పిల్లవాడు స్ఫురద్రూపి — నిజంగా వరప్రసాదిలాగుంటాడు—రెండురోజులయింది నీళ్ళాడి. తల్లికే ఏదో నలతగా వుంటోంది అని అంటుందోయి సిద్ధాంతీ! దాని క్కారణం వేతే కనపడదు. కర్కాటకలగ్నమే అంటావా నీవూను? దాని క్కారణం నే నలానే వూహిస్తూవున్నాను."

అందుమీద ప్రాథమికోపాధ్యాయు లిద్దఱూ ఆ నాటి పంచాంగం పుటలు విప్పి, తిధి వార నక్షత్రహోర లేవేవో గణించి గుణించి పావుగంటలో ఇలా తేల్చారు. సిద్ధాంతి తుది వాక్కు ఇది:—"అసలు నీవు మార్కండేయులూ! ఇందు విషయమై చింతించ నవసరం ఎంత మాత్రమూలేదు. పిల్లాడు కులాసాగా వున్నాడని వుంటాడని నీవే చెబుతున్నావు. తల్లీ కులాసాగా వుండి తీరుతుంది. "రాఫెల్సు ఎఫిమరెల్" మన కీనాడు గైడెన్సు అనుకో! దాన్నిబట్టి సింహలగ్నం! నీవేమో నీ మామూలు పంధాను కర్కాటకం అని అనుకొంటూ వ్యయం కాపరుస్తున్నావు. అదెన్నటికీ కాబోదు. ఈ పంచాంగాలన్నీ మస్తిష్కంలేని ఋషాకంగాలు. నమ్మ నా మాట!"

"ఆలా అయితే మఱి చింతే లేదు నాకు" అన్నాడు మార్కండేయులు — దానిమీద హనుచ్ఛిద్ధాంతి "ఎలిమెంటరీ స్కూళ్ళ మాస్టర్లకి చింత లేకపోవడమేమిటి? మహా మహా

కాలేజీ లెక్చరర్లకే వుంటూవున్నప్పుడు మొన్ననో కళాశాలా చార్యులవారు ఆయన జాతకం ఆయన భార్యా జాతకం అంతా నా యెదుటబెట్టి తన బాధలన్నీ నాతో ఏకరువుపెట్టుకునే సరికి-నాకు కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి. చింతలేనివా డెవ డోయి? ఈ లోకంలో" అన్నాడు.

"అయితే నాకూ ఏదో చింతవుందంటావు? ఏది చెప్పూ ప్రశ్న—నాకు ఇప్పుడున్న చింత ఏమిటో చెప్పు!" అని సవా లేశాడు మార్కండేయ శర్మ. సిద్ధాంతి "ప్రస్తుతం నీకున్న చింత సర్వసామాన్యంగా మాకు అందరికీ వున్న చింతేగాని అంతకన్న హెచ్చు చింతలేదు. మఱి పిల్లాడి జాతకలగ్నం సింహంక్రింద వేశాం కాబట్టి హెచ్చు చింత నీకు కలగపోదు. ఈ సర్వసామాన్యపు చింత నీలోనూ నాలోనూ వొక్కటే. నిర్బంధ ప్రాథమిక విద్యావిధానం అమల్లోపెట్టే పల్లెటూళ్ళకు గనుక మనల్ని వేశారా? ప్రెసిడెంటుగారు—చచ్చాం అన్న మాట!" "అయితే ఆ వూళ్ళకు బదిలీ కోరవద్దంటావు నన్ను?" "వేతే అనాలా ఆ ముక్క? ఆ వూళ్లో నీవు బడిపంతులు వయ్యేవే, రోజు రోజు తనిఖీయే, ఎంతమంది పిల్లల్ని చేర్చావు! వాళ్ళకేం భోజనం మధ్యాహ్నం పెట్టావు? ఏ తలిదండ్రుల్ని శిక్షించావు? అని అంతా ఇలాంటి బాడుగా చాకిరీయే! అలాంటి వూళ్లో పడడం సుఖాన్న వున్న ప్రాణాన్ని దుఃఖాన్ని పెట్టు కోవడమవుతుంది. ఎందుకు చెప్పేనో విను. కోరకు సుమా అలాంటి ట్రాన్స్ఫర్. ముమ్మాటికీ కోరకుసుమా! నేను కోరి పాముకుంటున్నాను చాలదూ" అంటూ ఆ సిద్ధాంతి వెంకట కృష్ణారాయపురం హాల్టులోనే దిగిపోయాడు.

మార్కండేయ శర్మకు సామర్లకోటదాకా వొకే చింత. "అరే! కోరేరాశానే ట్రాన్సుఫర్! "నిర్బంధ ప్రాథమిక విద్యావిధానం అమల్లో పెట్టబొయ్యే ప్రత్తిపాడుకే నన్ను వేసెయ్యండి! మానకండి!" అని కూడా కోరేశారానే—ఈ నేకోరిన కోరికనుబట్టి లెక్క చూచి నా కుర్రాడి జాతక లగ్నం కర్కాటక లగ్నంగానే తట్టుతూవుంది. శుద్ధవ్యయం కాకపోతే ఏమిటది? రైలుకారుకు కోచ్‌కు టిక్కట్టులకు 0-5-0 హోటలుకు 0-8-0 సాదరు 0-3-0 మొత్తము అమాంబాపతు రూపాయ తగలేసి యీ తగుపు తెచ్చి పెట్టుకున్నాను. ఇప్పుడు బదిలీ వద్దండీ అని వ్రాస్తే బాగుంటుందా? ప్రెసిడెంటుగారు అంగీకరిస్తారా?" అని ఒకేచింత.

ఆ చింతతోనే "కోచ్" దిగి ఇంటికి తోవలో ఆ పనీ యీపనీ చూచుకొని,—సాయంకాలం అయిదుగంటలకు చేరుకున్నాడు. చేరుకునీ చేరుకోవడంలో భార్య పురిటిగదిలో మూలుగుతూ "ఇలారండి! ఒక్కమారు నాకేసి చూడండి! ఇదేం అన్యాయం! ఇలా మాయమైపోయారు! ఆ మహా యిల్లాలే లేకపోతే—" అని ఆర్ధోక్తిలో ఏడవసాగింది.

ఇంతట ఎదురింటి గుమ్మం దాటుకుంటూ ఓ ఆవిడ వీరింటికివచ్చి "నా సాయ మొగసాయమేమిటి? ఆ డాక్టరుగారు ప్రాణమోశారు! ఆయందీ ఈ ఉపకారం అంతాను! మళ్ళీ చెట్టు నిలబడింది కడిపెడు కాయలు గాయడానికి—" అంది. పచ్చి బాలెంత వెంటనే "ఏడిశాడు డాక్టరు! అయిదురూపాయలు అక్కడ పెడితేనే గాని ఇంజెక్షనే ఇవ్వనన్నాడు వాడు! అంత కర్కోటకపు డాక్టర్లు వుంటారని ఎన్నడూ నేననుకోలేదు" అని రెచ్చింది.

శర్మ కదంతా అగోచరంగావుంది. మహా మాయగావుంది "అయితే పిల్లవాడిది కర్కాటకలగ్నమే! నా శాస్త్రమే సిద్ధాంతం! సిద్ధాంతి వేతకోత నీట గలిపెయ్యాలిసిందే!" అని అనుకోసాగాడు పైకి వినబడేలా.

ఎదురింటి ఇల్లాలు "ఇఖ కర్కాటకాలు వృశ్చికాలు ఎక్కడున్నాయయ్యా? అత్తమ్మో అంబళక్తో వచ్చిందటగా! ఎటుచూచినా సింహాలేసయ్యా! మీ అబ్బాయిది సింహాలగ్నమే" అంది. "మీరు వీడిది సింహాలగ్నం అని ఎలా సుస్థిరీకరించారు? తల్లీ!" అని అడిగాడు శర్మ. ఆమె "ఎట్లా ఏమిటి! నీ భార్య కీ పొద్దు ఉదయం నీవూ అలా వెళ్ళంగానే 105 డిగ్రీల జ్వరం అమాంతంగా వచ్చింది నీవు తిరిగి వచ్చేసరికి దిగిపోయింది. మామూలు స్థితిలో నీ భార్య నీ కిప్పుడు కనబడుతూవుండడమే–సింహాలగ్నానికి తార్కాణం!" అంది. చెప్పే ఆవిణ్ని విన కుండానే శర్మ "వృధావ్యయం ఇదంతా! ఈ వెధవది కర్నాటక లగ్నమే నేవ్! అందువల్లనే యీ వ్యయం!" అన్నాడు పురిటి గదిలోకి పారచూస్తు. భార్య "వ్యయమోగియమో వెధవో గిధవో–ముందావిడ బదులిచ్చిన అయిదురూపాయలు ఆవిడకు ఇచ్చేసెయ్యండి! కర్కోటకపు డాక్టరు ఐదురూపాయలాయిల్లాలు డాక్టరు అరచేతిలో పడేస్తేనేగాని డాక్టరు నా జబ్బలోకి సూది గ్రుచ్చాడే కాదు!" అంది.

భార్య సాధింపు పూర్తిగా వినకుండానే ఆ ప్రాథమి కోపాధ్యాయుడు ఎదరింటి ఇల్లాలికి తన పెళ్ళాం అన్న ఐదు రూపాయల బదులు తీరుస్తూ ఆమె కళ్ళల్లోకి సావధానంగా చూస్తూ "మీరున్ను కుర్రాడిది సింహాలగ్నమే అంటారా?"

అన్నాడు. ఆమె అలా ఇలా దృక్కు తేల్చుకుంటూ ఐదురూపా య్యలు అందుకుంటూ "ఏమిటో అన్నానేగాని మీకంటె ఎక్కువ తెలుసునా అండీ!" అంది. అందుకు సమాధానంగా శర్మ "అయితే కర్కాటకమా?" అని పునః కొంచబోయాడు గాని అంతలో పురిటిమంచం మీదనుంచి అతగాని మగనాలి తొంగి తొంగి ఇలా అంది. "అక్కగారూ! మనకంటె ఆయనకు వొక్క ఆకు యెక్కువ తెలియదండీ!" అని.

.... .... .... .... ....

## పువ్వాయమ్మ......పున్నెమా అంటా?

ఇదేంట్రా అబ్బా! ఉత్తికర్రే సిగురట్టింది!" అంటూ అత్యం తాశ్చర్యంగా పువ్వాయమ్మ ఓ వంటకట్టెను ప్రభాతన్నకు చూపించింది. అప్పుడే పట్టుకు వస్తూవుంది ఆ వంటకట్టెను అడితీ లోంచి ఆమె, కసాయివాని బారినుండి రక్షించిన మేకను ఎత్తు కొస్తూవున్నట్టు, ముద్దుగా, జాలిగా—"సూడబ్బా! ఇది అడితీ సిగురో అడివిసిగురో—వాళ్ల దీన్నికూడా గొడ్డలేసి పేడు సెయ్యబోతూవుంటే వూళ్ళాకక్క నట్టుకొచ్చాను. గుట్ట అట్టడు గుది—అడితి సిగురే! అడివిసిగురైతే ఇంతకాలముంటుందా తుండు నంటిపెట్టుకొని, చెట్టుకొట్టేశాక? అడితీసిగురే! ఇదేంట్రా అబ్బా! ఉత్తికర్రే సిగురట్టింది: ఇదీ పళంగా పాత్తే వనాంతర మైపోద్దా? ఏం సెట్టౌద్ది అంటావు! ప్రభాతన్నా!" అంది ఊ-చిగురుత్తాచూస్తూ ఎదరమనిషికి చూపిస్తూ. ప్రభాతన్న బెరడు గిల్లి మూచూచి ఆకుతుంచి చవిచూచి "ఆనడంలేదు. ఏంవిశమో!